డోలాయమానంలో టీడీపీ

మేమంతా సిద్ధం సభకు హాజరైన జనంలో ఓ భాగం (ఫైల్)



నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన టీడీపీ ఎన్నికల తర్వాత కావలి నుంచి ప్యాకప్ చెప్పేయడం ఖాయంగా కనిపిస్తోంది. పద్నాలుగేళ్ల సీఎం.. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభ అట్టర్‌ఫ్లాప్ కావడం, పది రోజుల వ్యవధిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభకు జనం ఉప్పెనలా తరలిరావడం చూసిన టీడీపీ శ్రేణులు నిశ్చేష్టులయ్యారు. కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఒంటెద్దు పోకడలు ఆ పార్టీ కేడర్‌ను తీవ్రంగా కలచి వేస్తున్నాయి. కావ్య బలపడితే టీడీపీ అథోగతి పాలవుతుందని భావిస్తున్న ఆ పార్టీ శ్రేణులు ఈ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించి వెళ్లగొట్టేందుకు 'సంసిద్ధం'గా ఉన్నారు.

- చంద్రబాబు ప్రజాగళం ఫ్లాప్
- సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' సూపర్ హిట్
- అభ్యర్థిత్వంపై క్యాడర్‌లో తీవ్ర వ్యతిరేకత
- డిపాజిట్లు కూడా కష్టమే అంటున్న పార్టీ శ్రేణులు
- వరుస పరిణామాలతో పార్టీని వీడుతున్న కార్యకర్తలు

కావలి: సార్వత్రిక ఎన్నికల తర్వాత కావలిలో టీడీపీ జెండా పీకేసే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కావ్య కృష్ణారెడ్డిని టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత ఆ పార్టీ పరిస్థితి డోలాయమానంలో కొట్టుమిట్టాడుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కావలిలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభకు పోటెత్తిన జన సంద్రాన్ని చూసిన తర్వాత ఎవరి నోట విన్నా.. ఇక టీడీపీ ఖతం అనే మాటే వినిపిస్తోంది. కావ్య కృష్ణారెడ్డి అభ్యర్థిత్వాన్ని తొలి నుంచి వ్యతిరేకిస్తున్న కేడర్‌తో పాటు తాజా పరిణామాల నేపథ్యంలో గ్రామస్థాయి కార్యకర్తలు, మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన కార్యకర్తలు కూడా మౌనంగా పార్టీని వీడుతున్నారు. పార్టీ కోసం తన సంపాదనంతా హారతి కర్పూరంలా ఖర్చు చేసిన మాలేపాటి సుబ్బానాయుడిని కాదని ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలానికి చెందిన కావ్య కృష్ణారెడ్డికి టికెట్ కేటాయించినప్పుడే కావలి టీడీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. ఓటమి ఖాయమని నిర్ధారించుకున్న మాలేపాటి, బీద రవిచంద్ర వర్గీయులు కూడా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. డబ్బు సంచులతో కావలి టికెట్ తెచ్చుకున్న కావ్య పార్టీ క్యాడర్‌ను పక్కన పెట్టి తన గుమాస్తాలకు, బంధువులకు బాధ్యతలు అప్పగించడంతో కీలక నాయకులు, కార్యకర్తలు కూడా మనస్థాపానికి గురయ్యారు. నలభై ఏళ్ల నుంచి పార్టీని నమ్ముకున్న వాళ్లు సైతం కూడా కావ్య పోకడలు తట్టుకోలేక వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.

ప్రజాగళం సభ ఫ్లాప్‌తో..



కావలిలో చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళంకు హాజరైన జనం (ఫైల్)

కావలిలో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభతో ఆ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ ఎంతో అర్థమైపోయింది. అట్టహాసంగా ప్రచారం చేసుకున్న ప్రజాగళం జనంతో నిత్యం రద్దీగా ఉండే ట్రంక్‌రోడ్డులో సభ పెట్టినా రెండు.. మూడు వేల మందిని కూడా సమీకరించలేక టీడీపీ అభ్యర్థి చతికిలపడ్డాడు. పద్నాలుగు ఏళ్ల సీఎం.. నలభై ఏళ్ల రాజకీయ పండితుడని చెప్పుకునే చంద్రబాబు సభ పెట్టడానికి జనం లేకపోవడంతో గంటకు పైగా హెలికాప్టర్ దిగిన చోటే బస్సులో నిరీక్షించాల్సిన పరిస్థితిని చూస్తే టీడీపీ దుస్థితికి అద్దం పడుతోంది. ఈ పరిణామం తర్వాత కావ్య కృష్ణారెడ్డి వ్యవహార శైలే కారణమని ఆరోపిస్తూ ఆ రోజు నుంచే కార్యకర్తలు పార్టీని వీడడం మొదలు పెట్టారు. పట్టణంలోని ప్రధాన వార్డులతో పాటు కావలి రూరల్, అల్లూరు, దగదర్తి, బోగోలు మండలాల్లోని పలు పంచాయతీల్లో టీడీపీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. పలు పంచాయతీల్లో పోలింగ్ ఏజెంట్లు కూడా పెట్టే పరిస్థితి కనిపించడం లేదు.

'మేమంతా సిద్ధం' సభకు జన ఉప్పెన

చంద్రబాబు ప్రజాగళం నిర్వహించిన పది రోజుల వ్యవధిలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్టణ శివారులో ఓపెన్ ప్లేస్‌లో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు జనం ఉప్పెనలా తరలివచ్చారు. లక్షన్నర మందికిపైగా వస్తారని అంచనాలతో ఏర్పాట్లు చేస్తే.. సభా ప్రాంగణం సరిపోక అటు రెండు.. ఇటు రెండు కిలోమీటర్ల మేర హైవేపై జనం ఆగిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. సభ పూర్తయ్యే వరకు కదలకుండా నిలబడిపోయారు. వీరంతా గుండెల నిండా జగన్‌మోహన్‌రెడ్డిని నింపుకున్న సామాన్య జనం. రోడ్డుపై నిలిచిపోయిన జనంలో రెండు శాతం కూడా టీడీపీ ప్రజాగళం సభకు హాజరు కాలేదని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు

ప్రజాగళం అట్టర్‌ఫ్లాప్ తర్వాత డోలాయమానంలో ఉన్న టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కావలిలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభ తర్వాత ఆ పార్టీకి చేరడానికి క్యూ కట్టారు. సభకు లక్షలాది జనం తరలిరావడం, అభివృద్ధి, సంక్షేమంపై వైఎస్సార్‌సీపీ అవలంబిస్తున్న విధానాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా వివరించడంతో కావ్యను వ్యతిరేకిస్తున్న టీడీపీ కార్యకర్తలు,తటస్థులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రతి రోజూ చేరికల సంఖ్య పెరుగుతూనే ఉండడంతో టీడీపీ దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది.

క్లుప్తంగా

విజయసాయిరెడ్డి ఫ్లెక్సీలకు అనుమతి

ఉదయగిరి: నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఫ్లెక్సీని వింజమూరు పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నేపథ్యంలో పలు పత్రికలు, సోషల్ మీడియాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని వార్తలు వస్తున్న నేపథ్యంలో మంగళవారం వింజమూరు ఇన్‌చార్జ్ ఈఓ శ్రీనివాసులురెడ్డి వివరణ ఇచ్చారు. వింజమూరులో ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకునేందుకు ఎన్నికల సంఘం నుంచి అభ్యర్థి అనుమతి తీసుకున్నారని, మే 10వ తేదీ వరకు ఈ ఫ్లెక్సీని కట్టేందుకు ఎన్నికల సంఘం నుంచి అనుమతికి సంబంధించిన ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు. ఈ విషయాన్ని పత్రికా విలేకరులు, సోషల్ మీడియా నెటిజన్లు పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేకపాటి అభినవ్‌రెడ్డి

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కుమారుడు మేకపాటి అభినవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వంటేరు రామచంద్రారెడ్డి, నాయకులు వంటేరు గోవర్ధన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వేలమూరి శ్రీధర్‌రెడ్డి, ద్రోణాదుల కృష్ణారెడ్డి, వేలమూరి చైతన్యరెడ్డి, తుమ్మల శ్రీనివాసులురెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి, పుట్టి నాగేశ్వరరావు, వరదారెడ్డి, వాకా వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో వరదరాజ స్వామి వారు

అల్లూరు: క్రోధి నామ నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పండగ సందర్భంగా నార్త్ మోపూర్‌లో కొలువైన వరదరాజస్వామి గరుడ వాహనంపై వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. నార్త్‌మోపూర్ గ్రామ బలిజ సంఘం ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

త్రైత సిద్ధాంతం క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో ముద్రించిన త్రైత శకం–46 కాలసూచికలను మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం బ్రాహ్మణపల్లిలో ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన ప్రబోధ సేవా సమితి సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు



సంగం: సంగంలో కొలువైన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం సింహ వాహన సేవ వైభవంగా జరిగింది. అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి సింహ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి బలిజ సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెరుమాళ్ల రవీంద్రబాబు, ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి, అర్చకులు నాగేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా నీ సంస్కారం ప్రశాంతి

- కావలి వైఎస్సార్‌సీపీ మహిళలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళలు

కావలి: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని సంబోధిస్తూ కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు మండిపడ్డారు. గొప్పింటి మహిళను అని గొప్పగా చెప్పుకునే నీ సంస్కారం ఇదేనా అంటూ విరుచుకుపడ్డారు. ఇటీవల ప్రశాంతి మాట్లాడిన ఒక ఆడియో బయటకు రావడం తెలిసిందే. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ అనురాధ ఆధ్వర్యంలో మహిళా నేతలు పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ప్రస్తావిస్తూ సంస్కార హీనంగా మాట్లాడిన ప్రశాంతి వ్యాఖ్యలను ఖండించారు. గొప్పింటి మహిళ అయి ఉండి సంస్కారం మరచి మాట్లాడటం సభ్యత కాదన్నారు. మీ అవసరాల కోసం పార్టీలు మారిన చరిత్ర మీదని, నీతి, నిజాయితీ, నిబద్ధతతో పదేళ్లుగా ఎమ్మెల్యేగా ప్రజాభిమానాన్ని చూరగొన్న ప్రతాప్‌కుమార్‌రెడ్డిని అనేంత స్థాయి నీకు లేదనే విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. మంచి వ్యక్తి, సంస్కారం తెలిసిన వ్యక్తి, సౌమ్యుడైన ప్రతాపన్నపై అనుచిత వ్యాఖ్యలను చేయడంపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



పెద్ద మసీదులో ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు. మంగళవారం రాత్రి మున్సిపల్ పరిధిలోని పడమరవీధి పెద్ద మసీదులో ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయనకు మసీదు పెద్దలు సాదర స్వాగతం పలికారు. అనంతరం మసీదులో మౌజమ్‌లతో కలిసి దువా చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సయ్యద్ జమీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, మౌజమ్ జహీర్, మైనార్టీ నాయకులు షేక్ రహీం, సయ్యద్ జమీర్, ఐవీ రమణారెడ్డి, మునిరెడ్డి, కలాం, సాదిక్ పాల్గొన్నారు.

ఊరూరా ఉగాది సంబరాలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆత్మకూరు: తెలుగువారి తొలి పండగ క్రోధి నామ సంవత్సర ఉగాదిని మంగళవారం ఆత్మకూరులో వేడుకగా నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ ప్రాంతంలో అపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని నిర్వహించి పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని ప్రత్యేక వేదికపైకి కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి, సుందరమ్మ కోదండ రామాలయంలో ఉగాది వేడుకలను వేడుకగా నిర్వహించారు. భక్తులు దర్శనం కోసం వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకున్నారు. మేధా పాఠశాలలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకగా నిర్వహించారు. దేవాలయాల్లో పంచాంగ శ్రవణం అర్చకులు చదివి వినిపించారు.

ఘనంగా ఉగాది సంబరాలు

ఉదయగిరి: ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో తెలుగు నూతన సంవత్సరాది క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా మండలాల్లోని ఆలయాల్లో స్వామి వార్లకు అర్చకులు విశేష అభిషేకాలు, పూజలు, అలంకరణలు నిర్వహించారు.



ఆత్మకూరు అపస్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి అందజేస్తున్న దృశ్యం

భక్తులు షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి స్వీకరించారు.

- దుత్తలూరు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో వెంగమాంబ–గురవయ్య దంపతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా అర్చకులు కల్యాణం జరిపించారు. ఆలయ ఈఓ ఉషశ్రీ అమ్మవారికి పట్టు చీర, గాజులు సమర్పించారు. రెడ్లదిన్నె దేవరబోడుపై కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగమ్మ పూలంగి సేవ

సోమశిల: మండలంలోని గుడిగుంటలో కొలువైన గంగమ్మ తల్లి ఆలయంలో మంగళవారం ఉగాది పండగను పురస్కరించుకుని అమ్మ వారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చేజర్ల: మండలంలోని పలు దేవాలయాల్లో తెలుగు సంవత్సరాధి (ఉగాది) పండగను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. వేద పండితులు పంచాంగ శ్రవణం గావించారు. చేజర్ల నడివీధి రామాలయంలో భక్తులకు పూజలు నిర్వహించారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఈఓ ఉషశ్రీ




గండిపాళెంలోని సిద్ధేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పచ్చ కంపు పోయింది..!

ఆత్మకూరు నియోజకవర్గంలో ఇటీవల వైఎస్సార్‌సీపీని వీడిన వారంతా టీడీపీ కోవర్టులే. అధికార పార్టీని అడ్డం పెట్టుకుని అడ్డంగా దోచుకోవాలని యత్నించి.. వీలు పడకపోవడంతో ప్యాకేజీల కోసం పార్టీని వీడారు. వైఎస్సార్‌సీపీకి పట్టిన పచ్చ కంపు పోయిందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అసలు సిసలైన నిఖార్సైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పార్టీకి 'కావలి కాస్తున్నారు'. నేతల వైఖరిని చూసి పార్టీలకు అతీతంగా ప్రజలు ఈసడించుకుంటున్నారు.

- స్వార్థంతో వచ్చారు.. పార్టీ వీడారు
- వాళ్లంతా టీడీపీ కోవర్టులే
- ఈసడించుకుంటున్న ప్రజలు



ఆత్మకూరు: 'ఒడ్డు చేరే వరకు మల్లన్న.. గట్టెక్కాక బోడి మల్లన్న' సామెత చందనా ఉంది కొందరు మాజీ టీడీపీ నేతల పరిస్థితి. ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయిన వారంతా ఆషాడభూతుల్లాంటి వారిని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. అవసరానికొక పార్టీ, పూటకొక మాట మార్చే ఊసర వెల్లులు. వీరంతా వైఎస్సార్‌సీపీని వీడడం వల్ల పార్టీకి వచ్చే నష్టమేమీలేదని, వైఎస్సార్‌సీపీ గెలుపులో వీరి పాత్రంటూ ఏమీ లేదని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఆత్మకూరు నియోజకవర్గంలో వరుసగా మూడు సార్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో మరో పార్టీకి స్థానం లేని పరిస్థితి నెలకొంది. 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా మేకపాటి గౌతమ్‌రెడ్డి 20 వేల పైచీలుకు ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి మంత్రి హోదాలో దివంగతులు కావడంతో 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి 80 వేల పైచిలుకు భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం, గౌతమ్‌రెడ్డి మంత్రి కావడంతో టీడీపీలో ఉన్నవారంతా వైఎస్సార్‌సీపీ పంచన చేరారు. తిరిగి వారినే పార్టీలో చేర్చుకుంటూ గొప్పగా ప్రకటించుకోవడం చర్చనీయాంశమైంది. ఇలా స్వార్థంతో సొంత అవసరాల కోసం వైఎస్సార్‌సీపీలో చేరి దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అండదండలతో పదవులు, కాంట్రాక్ట్ పనులు పొంది అర్ధాంతరంగా పార్టీ వీడడాన్ని ప్రజలు ఛీదరించుకుంటున్నారు. వీరికి ప్రజల భవిష్యత్ కన్నా.. వారి భవిష్యత్తే ముఖ్యమని ప్రజలంటున్నారు.

- చేజర్ల సొసైటీ (పీఏసీఎస్) చైర్మన్ బూదళ్ల వీరరాఘవరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరి దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి ద్వారా సొసైటీ పదవిని దక్కించుకున్నారు. గతంలో టీడీపీలో ఉన్న ఆయనకు ఆ పార్టీలో ఈ పదవి దక్కిన దాఖలాలు లేవు. అయినా టీడీపీలోకి జంప్ అయ్యారు. మైనార్టీ నేత షేక్ సిరాజ్ దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి అండదండలతో తన భార్యకు గతంలో జెడ్పీటీసీ పదవిని దక్కించున్నారు. అయితే ఇటీవల తనకు వైఎస్సార్‌సీపీలో ప్రాధాన్యత లేదని సాకు చూపి టీడీపీలోకి జంప్ అయ్యారు. గతంలో టీడీపీలోనే ఉండి కొంత కాలం వైఎస్సార్‌సీపీలో కొనసాగిన టీకేపాడుకు చెందిన మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు టీడీపీ కోవర్టుగా వ్యవహరిస్తూ తిరిగి ఆ పార్టీ పంచన చేరాడు. పుట్టుపల్లి ఎంపీటీసీ షేక్ మస్తాన్, టీకేపాడు ఎంపీటీసీ తిరుపతమ్మ, పాడేరు ఎంపీటీసీ ప్రభావతి, గ్రామ సర్పంచ్ గుమ్మా వెంకటేశ్వర్లు తదితరులు దివంగత గౌతమ్‌రెడ్డి అండదండలతో పదవులు పొంది అవసరాలు తీరాక జంప్ జిలానీల్లా టీడీపీ కండువాలు కప్పుకున్నారు.
- అనంతసాగరం మండలంలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో సర్పంచ్‌లుగా గెలుపొందిన బిజివేముల ఓబుల్ రెడ్డి (పాతాళపల్లి), గౌరవరం సర్పంచ్ శాఖమూరి సుబ్బారావు, దేవరాయపల్లి సర్పంచ్ షేక్ రమీజాబేగం సాకులు చూపి టీడీపీ పంచాన చేరారు.
- మర్రిపాడు మండలంలో నందవరం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కోనంకి శ్రీనివాసులు నాయుడు గ్రామంలో సుమారు రూ.20 లక్షలు కాంట్రాక్ట్ పనులు పొందాడు. ఇప్పుడు టీడీపీలోకి జంప్ అయ్యాడు. పొంగూరు కండ్రిక సర్పంచ్ జి మాధవి, కేతిగుంట సర్పంచ్ తేజలు వైఎస్సార్‌సీపీ మద్దతుతో పదవులు పొంది ఇప్పుడు పార్టీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలోకి వెళ్లారు.
- ఏఎస్‌పేట మండలంలో రాజవోలు సొసైటీ మాజీ చైర్మన్ కాటంరెడ్డి నారసింహారెడ్డి, చిరమన గ్రామ ఎంపీటీసీ కె శైలజారెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పదవులు పొంది ఆనం అభ్యర్థిగా ప్రకటించగానే టీడీపీ కోవర్టులైన వీరు తిరిగి ఆ పార్టీ పంచనే చేరారు.

జంప్ జిలానీలు అందరూ టీడీపీ కోవర్టులే..

సంగం మండలానికి చెందిన కర్నాటి రావీంద్రారెడ్డి గతంలో టీడీపీలో ఉండి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో పార్టీలో చేరారు. ఆయనకు నాటి మంత్రి గౌతమ్‌రెడ్డి మండలంలో ఆయనకు అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. సర్పంచ్ పదవీ అవకాశాన్ని ఆయన చెప్పిన వ్యక్తి నిమ్మల రమణమ్మకే అవకాశం ఇచ్చాడు. రూ.2 కోట్ల విలువైన సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణ పనులు ఆయనకు అప్పగించారు. అయితే ఆయన పలువురు వద్ద ప్రభుత్వ, సీజేఎఫ్ఎస్, తదితర సుమారు 200 ఎకరాల భూములను కొనుగోలు చేసి వాటిని క్రమబద్ధీకరించాలని అప్పట్లో మంత్రి గౌతమ్‌రెడ్డి దగ్గర, ఆ తర్వాత ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దగ్గరకు తీసుకువచ్చారు. అయితే అది సాధ్యం కావడంతో ఆయన ఆశ నెరవేరలేదు. దీన్ని సాకుగా చూపి తిరిగి టీడీపీలోకి జంప్ అయ్యారు. వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డికి అప్పట్లో గౌతమ్‌రెడ్డి సర్పంచ్ అవకాశం ఇచ్చారు. ఇప్పుడు టీడీపీలోకి జంప్ అయ్యారు. ఆయన ఆ గ్రామంలో కొన్ని కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్నారు. అవసరం తీరక పార్టీ నుంచి ప్యాకేజీల కోసం టీడీపీలోకి జంప్ అయ్యారు.

విగ్రహ ప్రతిష్టకు సీతారాముల విగ్రహాల రాక



సీతా, రామ, లక్ష్మణ, హనుమంత్ సమేత పంచలోహ విగ్రహాలను మేళతాళాలతో ఆలయం వద్దకు తీసుకెళ్తున్న భక్తులు

ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లిలో సీతా, లక్ష్మణ, హనుమత్ సమేత కోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధానార్చకుడు కల్యాణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 18వ తేదీ ప్రాతః కాల గణపతి పూజ, మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. మూడో రోజు 19వ తేదీ శుక్రవారం ఉదయం 10.20 గంటలకు శాంతి కల్యాణం నిర్వహిస్తున్నామని, ఔత్సాహిక దంపతులు కంకణధారణ చేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మేకపాటి సోదరులను కలిసిన నాయకులు

ఉదయగిరి : మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డిలను మంగళవారం బ్రాహ్మణపల్లిలో దుత్తలూరు మండల నాయకులు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఎల్‌పీ మాలకొండారెడ్డితో పాటు మరికొంత మంది కాసేపు రాజకీయ పరిస్థితులపై చర్చించారు.